క్లుప్తంగా

ఉత్సాహంగా ఉట్టి వేడుక



ఉట్టి కొట్టేందుకు పోటీపడుతున్న చిన్నారులు

రోలుగుంట: శ్రీకృష్ణాష్టమి పురస్కరించుకుని శుక్రవారం రాత్రి స్థానిక జీవకారుణ్యం సంఘం వద్ద ఉట్టి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఏటా మాదిరిగానే ఇక్కడ ఉత్సవంలో ఉట్టి కొట్టేందుకు చిన్నారులు పోటీపడ్డారు. దాదాపు గంట పాటు సాగిన ఈ ఆటలో చిన్నారి జి .రమణ పగులగొట్టి విజేతగా నిలిచాడు. అతడికి నిర్వాహకులు ఆడారి గణేష్ చోప్రా, మడ్డు గోపి, తమరాప సతీష్ అభినందించి బహుమతి అందజేశారు.

న్యాయవాదుల నిరసన



కోర్టు సముదాయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

నర్సీపట్నం: ఉత్తరప్రదేశ్‌లో న్యాయవాదులపై దాడిని ఖండిస్తూ స్థానిక న్యాయవాదులు గురువారం విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రావాడ సత్యనారాయణ, లోవరాజు మాట్లాడుతూ న్యాయవాదులపై దాడులను అరికట్టాలన్నారు. ఉత్తరప్రదేశ్‌లో న్యాయవాదులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి



గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి పూజ్య మేఘన

దేవరాపల్లి: గర్భిణులు పౌష్టికాహారంతోపాటు తగిన విశ్రాంతి తీసుకోవాలని వైద్యాధికారి ఇ. పూజ్య మేఘన తెలిపారు. స్థానిక పీహెచ్‌సీలో ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ యోజనలో భాగంగా శుక్రవారం గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. పీహెచ్‌సీ పరిధిలోని వివిధ గ్రామాల నుంచి హాజరైన 25 మందిలో ఐదుగురు హైరిస్క్ గర్భిణులను గుర్తించారు. వీరిలో ముగ్గురిని మెరుగైన వైద్య సేవల కోసం కె.కోటపాడు కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. అనంతరం గర్భిణుల ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

10న ఉపకార వేతనాలకు అర్హత పరీక్ష

మాడుగుల రూరల్: ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థుల ఉన్నత చదువుకు స్కాలర్ షిప్ అందిస్తున్నామని సృజనవాణి స్వచ్ఛంద సంస్థ సమన్వయకర్త కె.జానీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, నర్సింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు 250 మందికి స్కాలర్ షిప్ అందించేందుకు ఈ నెల 10న ఉదయం 9 గంటలకు వీరవల్లి అగ్రహారం పెట్రోల్‌బంక్ సమీపంలో సంస్థ కార్యాలయంలో రాత పరీక్ష నిర్వహిస్తామన్నారు. పూర్తి వివరాల కోసం 7989947349 సంప్రదించాలన్నారు.

జేడీపేటలో 90 మందికి వైద్య పరీక్షలు



చిన్నారులను పరీక్షిస్తున్న వైద్యాధికారి మాలెంనాయుడు

మాడుగుల: ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమంలో భాగంగా జమ్మాదేవిపేటలో శుక్రవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కింతలి పీహెచ్‌సీ వైద్యాధికారి కె. మాలెంనాయుడు 90 మందికి బీపీ, సుగర్, తదితర పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి విద్యార్థులను, చిన్నారులను పరీక్షించి ఆరోగ్య జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొసిరెడ్డి కృష్ణమూర్తి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో ఊపందుకున్న వరినాట్లు

- మాడుగుల మండలంలో 80 శాతం పూర్తి



ముకుందపురంలో వేసిన వరినాట్లు



ఒమ్మలిలో వరినాట్లు వేస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్: వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఈ ఏడాది ఖరీఫ్ సాగుపై ఆశలు వదులుకున్న రైతన్నకు రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షంతో ఆశలు చిగురించాయి. ఇప్పటికే వరినాట్లు ఆలస్యం కావడంతో తాజాగా కురిసిన వర్షంతో వరినాట్లు ఊపందుకున్నాయి. గత నెలలో సాధారణ వర్షపాతం కంటే తక్కువగా నమోదు కావడం వల్ల వరినాట్లు ఆలస్యమయ్యాయి. మండలంలో 4,285 హెక్టార్లు సాధారణ విస్తీరణం కాగా, ఇంత వరకు 3,349 హెక్టార్లలో వరినాట్లు వేసినట్లు మండల వ్యవసాయాధికారులు తెలిపారు. మిగిలిన 900 హెక్టార్లలో వరినాట్లు ఈ నెలాఖరులోగా పూర్తి కానున్నాయి. ఆగస్టులో సాధారణ వర్షపాతం 188 మిల్లీ మీటర్లు కాగా, 96 మిల్లీ మీటర్లు మాత్రమే నమోదైంది. జూలైలో సాధారణ వర్షపాతం 235 మిల్లీమీటర్లు కాగా, 272 మిల్లీ మీటర్లు నమోదైంది. వరి నారుమడులకు ఈ వర్షపాతం ఎంతో ఉపయోగపడిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 7వ తేదీ వరకు 33 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది. ఈ నెలలో సాధారణ వర్షపాతం 245 మిల్లీ మీటర్లు కాగా, ఇంత వరకు పడిన వర్షం వల్ల ముమ్మరంగా వరినాట్లవుతున్నాయి. అడపా దడపా కురుస్తున్న వర్షాలు వల్ల ప్రధానంగా పెద్దేరు, తాచేరు జలాశయాలల్లో నీటి మట్టం పెరగడంతో ఆయకట్టు భూముల్లో ప్రస్తుతం ముమ్మరంగా వరినాట్లు వేస్తున్నారు.

నెలాఖరులోగా శతశాతం

ఈ నెలాఖరులోగా శతశాతం వరినాట్లు పూర్తవుతాయి. గత నెల ఆశించిన మేర వర్షపాతం నమోదు కాకపోవడం వల్ల వరినాట్లు ఆలస్యమయ్యాయి. మండలంలోని జలాశయాలల్లో నీటిమట్టం గణనీయంగా పెరగడం వల్ల శతశాతం వరినాట్లు పూర్తి కానున్నాయి.

ఎం. వాసుదేవరావు,
ఏవో, మాడుగుల మండలం

వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి



చేతుల శుభ్రతపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

మాకవరపాలెం: వ్యక్తిగత ఆరోగ్యంపై విద్యార్థులు శ్రద్ధ తీసుకోవాలని వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు విద్యార్థులకు సూచించారు. స్వచ్ఛత పక్వాడా కార్యక్రమంలో భాగంగా తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు చేతుల శుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎన్ఎం సత్యవతి మాట్లాడుతూ నిత్యం భోజనం చేసే ముందు తర్వాత చేతులు సబ్బుతో శుభ్రం చేసుకోవాలని సూచించారు. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వ్యాధుల బారిన పడక తప్పదని హెచ్చరించారు. ఉపాధ్యాయులు లోవరాజు, సంతోషి, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

దీక్ష పోస్టర్ విడుదల

నర్సీపట్నం: ఏపీ సమగ్ర శిక్ష పొరుగు సేవల ఉద్యోగుల ఫెడరేషన్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు స్థానిక ఎంఈవో కార్యాలయం వద్ద సమగ్ర శిక్షణ ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈ నెల 10న కలెక్టర్ కార్యాలయం వద చేపట్టనున్న దీక్షకు సంబంధించి వాల్ పోస్టర్లను నర్సీపట్నం ఫెడరేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వరహాలనాయుడు, రమేష్ విడుదల చేశారు.

దివ్యాంగులకు సంక్షేమ పథకాల అమలు



ఫిజియోథెరపీ చేస్తున్న ఫిజియోథెరపిస్టు

మాకవరపాలెం: దివ్యాంగులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో పి.ఎస్.ఎన్.మూర్తి సూచించారు. ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక భవిత కేంద్రంలో సెరిబ్రల్ పాల్సీ దివ్యాంగులకు ఫిజియోథెరపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి మాట్లాడుతూ దివ్యాంగులకు విద్యా శాఖ ద్వారా ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తుందన్నారు. వీటిని దివ్యాంగుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఫిజియోథెరపిస్టు, భవిత కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ మండల కమిటీ ఏకగ్రీవం



అధ్యక్షుడు రమణ



జనరల్ సెక్రటరీ రాము

రోలుగుంట: ఏపీటీఎఫ్ మండల కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఈ మేరకు సంఘం జిల్లా నాయకులు డి.పి.అప్పారావు, ఆర్.ప్రకాష్ శుక్రవారం ఇక్కడ సభ్యుల ఆమోదంతో మండల కమిటీ ఏకగ్రీవమైనట్లు ప్రకటించారు. అధ్యక్షుడిగా పెదపాటి రమణ, ప్రధాన కార్యదర్శిగా బోనెల రాము, గౌరవాధ్యక్షుడిగా ఎం.దేముడు, ప్రధాన సలహాదారుడిగా ఆర్.వి.ఎస్.ఆర్.శర్మ, తదితర కార్యవర్గం ఎన్నికైంది. ఈ సందర్భంగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సంఘం అభివృద్ధికి శక్తివంచన లేకుండా పని చేస్తామన్నారు.

30 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష

నర్సీపట్నం: గ్రామ స్థాయిలోనే ప్రజలకు వైద్య సేవలను మరింత చేరువ చేసేందుకు ప్రభుత్వం ఈ నెల 30 నుంచి జగనన్న సురక్ష వైద్య శిబిరాలను నిర్వహిస్తుందని ఎంపీడీవో జయమాధవి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వలంటీర్లు, వైద్య సిబ్బందితో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఉన్న గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. 15 రోజులు ముందు వలంటీర్లు, వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించాలన్నారు. డాక్టర్ అనూష మాట్లాడుతూ అన్ని రకాల వైద్య సేవలను శిబిరంలో అందిస్తామన్నారు.

చెట్టుపల్లిలో సామాజిక తనిఖీ

నర్సీపట్నం: చెట్టుపల్లిలో ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ బృందం గ్రామ సభ నిర్వహించింది. ఈ సభకు వైస్ ఎంపీపీ ఇన్నం రత్నం, సర్పంచ్ గజాల నూకరత్నం హాజరయ్యారు. గ్రామంలో చేపట్టిన వివిధ రకాల పనులను బృందం వివరించింది. రైతులు చేను కల్లాలను ఎత్తు చేసుకునేందుకు నిధులు మంజూరు చేయాలని అధికారులను ఎంపీపీ కోరారు. ఉపాధి పనులతో గ్రామాల్లో మౌలిక సదుపాయాలు సమకూరుతున్నాయని సర్పంచ్ పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు తన దృష్టికి తీసుకువచ్చిన అంశాలను అధికారులకు నివేదిస్తానని ఏపీవో నానిబాబు పేర్కొన్నారు.

పెద్దల సమక్షంలో కులాంతర వివాహం



చీడికాడ శివాలయంలో పెద్దలతో ప్రేమ జంట

చీడికాడ: పెద్దలు, కుల సంఘం నేతల ఆధ్వర్యంలో ప్రేమ పెళ్లి జరిగింది. చీడికాడకు చెందిన వేచలపు మణికంఠ, మునగపాక మండలం ఉమ్మలాడకు చెందిన కె.సర్వలక్ష్మి రెండేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. కులాల వేరు కావడంతో ఇరు కుటుంబాల వారు వీరి పెళ్లికి అంగీకరించలేదు. దీంతో మణికంఠ తన ప్రియురాలి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఆమె కుటుంబ సభ్యులు దళిత బహుజన సేన అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు ఎల్.శ్రీను, ఎస్సీ, ఎస్టీ మోనటరింగ్ కమిటీ సభ్యులు గంగాధర్, మరియమ్మల దృష్టికి తీసుకెళ్లారు. వారితో కలిసి పోలీసులను ఆశ్రయించగా ఇరు కుటుంబాలకు కౌన్సెలింగ్ ఇచ్చి పెళ్లికి ఒప్పించారు. ఈ మేరకు శుక్రవారం చీడికాడ శివాలయంలో ప్రేమ జంటకు పెళ్లి చేశారు. దళిత సంఘ నేతలతోపాటు ఉత్తరాంధ్ర బీఎంఎస్ సెక్రటరీ గంగాధర్ ముదిరాజు పాల్గొన్నారు.

పార్వతీదేవికి లక్ష పసుపు కొమ్ములతో అభిషేకం



చోడవరం: గవరవరం శివాలయంలో పార్వతీదేవికి లక్ష పసుపు కొమ్ములతో ప్రత్యేక అభిషేకం చేశారు. శ్రావణమాసం నాల్గో శుక్రవారం సందర్భంగా అమ్మవారికి ఉదయం నుంచి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కుంకుమార్చనలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

సంతోషిమాతకు శ్రావణమాస పూజలు



సంతోషిమాత ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో సంతోషిమాత

మాడుగుల రూరల్: శ్రావణమాసం నాల్గో శుక్రవారం పురస్కరించుకుని కె.జె.పురం జంక్షన్ వద్ద సంతోషిమాత ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక కుంకుమార్చన, అభిషేకాలు, గోమాతకు పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక దర్శనం కల్పించారు. గ్రామస్తులతో పాటు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన 800 మంది భక్తులు ఉదయం 7 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు అమ్మవారికి పూజలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కాళ్ల అమృతల్లినాయుడు పర్యవేక్షణలో వీరికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నారు. గ్రామానికి చెందిన పాలకుర్తి అరుణ్‌కుమార్, వసుంధర దంపతుల ఆర్థిక సాయంతో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. భక్తులకు మోదమాంబ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఉచిత ఆటో సౌకర్యం కల్పించారు. భక్తులకు లాటరీ తీసి ఆలయ కమిటీ అధ్యక్షుడు బహుమతులను అందజేశారు.

ఆదివాసీ సదస్సు విజయవంతం చేయాలి



వాల్ పోస్టర్ విడుదల చేస్తున్న రైతు కూలీ సంఘం నేతలు

చోడవరం రూరల్: దేశ పర్యావరణానికి నష్టం కలిగించే, ఆదివాసీ హక్కులను హరించే కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బిల్లులను వ్యతిరేకిస్తూ ఈ నెల 12,13 తేదీల్లో విశాఖలో జరగనున్న అఖిల భారత ఆదివాసీ సదస్సును విజయవంతం చేయాలని కోరుతూ శుక్రవారం వాల్‌పోస్టర్‌ను ఏపీ రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి కోన మోహన రావు విడుదల చేశారు. అఖిల భారత కేత్ మజ్దూర్ కిసాన్ సభ (ఏఐకేఎంకేఎస్) ఆధ్వర్యంలో జరగనున్న ఈ సదస్సులో కేంద్ర ప్రభుత్వం జూలై 26న ప్రవేశపెట్టిన రెండు బిల్లులకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఉద్యమించడానికి కార్యాచరణను ప్రకటిస్తారని ఆయన తెలిపారు. ఈ సదస్సుకు పెద్ద సంఖ్యలో గిరిజన, రైతు కూలీలే గాకుండా ప్రజాస్వామ్యవాదులు హాజరు కావాలని కోరారు. రైతు కూలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పైలా రమేష్, జిల్లా కమిటీ సభ్యులు మరిసా సతీష్, కెంబూరి కల్పన, ఏఐఎఫ్‌టీయూ నాయకులు అయితిరెడ్డి అప్పలనాయుడు, సభ్యులు మరిసా నరేష్, కాకర కాంతం పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీ మృతికి సంతాపం

గొలుగొండ: ఏఎల్‌పురం మాజీ ఎంపీటీసీ సభ్యుడు చింతల నారాయణమూర్తి నాయుడు మృతిపై పలువురు నాయకులు, గ్రామస్తులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన ఏఎల్‌పురం ఎంపీటీసీగా పనిచేశారు. ఇటీవల అనారోగ్యం బారిన పడటంతో విశాఖ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో గురువారం మరణించారు. శుక్రవారం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. పలువురు నాయకులు నివాళులర్పించారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

చోడవరం రూరల్: ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని హాపూర్‌లో న్యాయవాదుల పట్ల పోలీసులు దౌర్జన్యాన్ని నిరసిస్తూ చోడవరం న్యాయవాదులు తమ విధులను బహిష్కరించారు. చోడవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాంగ్రేగుల డేవిడ్ నేతృత్వంలో కోర్టులకు గైర్హాజరయ్యారు. దీంతో శుక్రవారం నాటి కేసులన్నింటినీ వాయిదా వేసారు. పలువురు కక్షిదారులు కోర్టులకు హాజరైనా వెనువెంటనే ఇంటిముఖం పట్టారు. న్యాయవాదుల పట్ల పోలీసుల దౌర్జన్యాలకు అడ్డుకట్ట వేయాలని, బాధ్యులపై తక్షణమే క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అపిడమిక్ సీజన్‌లో ఆరోగ్య జాగ్రత్తలు తప్పనిసరి



నిల్వ నీటిని తొలగించే పద్ధతులను వివరిస్తున్న హెల్త్ అసిస్టెంట్ రాజు

కె.కోటపాడు: ప్రస్తుతం వర్షాలు పడుతున్న దృష్ట్యా ఇంటితోపాటు పరిసరాల్లో మురుగు తొలగించే చర్యలను తీసుకోవాలని చౌడువాడ పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ డి.ఎస్.ఎన్.రాజు తెలిపారు. శుక్రవారం గుల్లేపల్లిలో ఫ్రైడే-డ్రైడే కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఇంటి పరిసరాల్లో ఖాళీ టైర్లు, కొబ్బరి బొండాలలో నిల్వ నీటిని తొలగించాలని అవగాహన కల్పించారు. దోమకాటుకు గురై ప్రమాదకరమైన మలేరియా, డెంగ్యూ బారిన పడకుండా మురుగు తొలగించాలన్నారు. ప్రస్తుత అపిడమిక్ సీజన్‌లో వైద్య సిబ్బంది సూచనలను పాటించడం ద్వారా మంచి ఆరోగ్యాన్ని పొందవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు సన్యాసమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలుపురంగు పశువులకు లంపీస్కిన్ వ్యాక్సిన్

పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బైరాగి



రైతులకు పెంపకంలో జాగ్రత్తలను వివరిస్తున్న అసిస్టెంట్ డైరెక్టర్ బైరాగి

కె.కోటపాడు: లంపీస్కిన్ వ్యాధి బారిన పడకుండా ఉండేందుకు తెలుపురంగు పశువులకు తప్పనిసరిగా వ్యాక్సిన్ వేయించాలని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జి.బైరాగి తెలిపారు. పశు విజ్ఞాన బడి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మురుగుపాలెంలో పాడి రైతులు పెంపకంలో పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. గత నెల 1న ప్రారంభమైన లంపీస్కిన్ వ్యాక్సినేషన్ కార్యక్రమంలో భాగంగా కె.కోటపాడు మండలంలో 8,400 పశువులకు గాను 5349, దేవరాపల్లి మండలంలో 6390 పశువులకుగాను 3567 పశువులకు వ్యాక్సిన్ వేసినట్లు తెలిపారు. మిగిలిన పశువులకు ఈ నెలాఖరులోగా వేసి శతశాతం పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ వ్యాధి బారిన పడిన పశువుల శరీరంపై బొబ్బలు రావడం, గిట్టల వాపుతో నడవలేకపోవడం, అధిక ఉష్ణోగ్రతతో కూడిన జ్వరం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. ఈ నేపథ్యంలో ముందస్తుగా లంపీస్కిన్ వ్యాక్సిన్ వేస్తున్నట్లు ఆయన వివరించారు. అదేవిధంగా 60 శాతం రాయితీపై సమీకృత దాణాను రైతులకు అందించనున్నట్లు తెలిపారు. దాణాను పశువులకు మేతగా ఇవ్వడం వల్ల ఆరోగ్యంతోపాటు పాల దిగుబడి మెరుగ్గా ఉంటుందన్నారు. తద్వారా పాడి రైతులకు మంచి ఆదాయం పాల ద్వారా సమకూరనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో గొండుపాలెం ఆర్బీకే పశువైద్య సహాయకుడు రఫీ పాల్గొన్నారు.

15లోగా ఈ-క్రాప్ నమోదుకు అవకాశం



మేడిచర్లలో ఈ-క్రాప్ నమోదును పరిశీలిస్తున్న ఏవో సోమశేఖర్

కె.కోటపాడు: వరి, చెరుకు పంటల వివరాలను ఈ నెల 15లోగా ఈ-క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి పి.సోమశేఖర్ తెలిపారు. మేడిచర్ల, రొంగలినాయుడుపాలెం గ్రామాల్లో వ్యవసాయశాఖ సహాయకులు నమోదు చేస్తున్న ఈ-క్రాప్‌ను శుక్రవారం ఆయన పరిశీలించారు. ప్రతీ పంట వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. తప్పనిసరిగా రైతుల పొలం వద్దకు వెళ్లి వారి పంట వివరాలను నమోదు చేయాలని తెలిపారు. ఈ-క్రాప్ నమోదుతో రైతులకు ప్రభుత్వం ద్వారా అమలు చేసే వ్యవసాయ సంబంధిత సంక్షేమ కార్యక్రమాలకు అర్హులుగా గుర్తించనున్నారన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సహాయకుడు హరీష్ పాల్గొన్నారు.

చోడవరం ఏఎంసీ చైర్మన్ ఏడువాక పదవీకాలం పొడిగింపు



చోడవరం: చోడవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఏడువాక సత్యారావు పదవీకాలాన్ని ప్రభుత్వం పొడిగించింది. గత నెల 28వ తేదీతో ఈయన పదవీ కాలం ముగియగా, తాజాగా ఆయననే కొనసాగిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయనతోపాటు ప్రస్తుత పాలక వర్గ కమిటీ యథావిధిగా కొనసాగనుంది. తన పదవీకాన్ని పొగించినందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారావుకు, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీకి సత్యారావు కృతజ్ఞతలు తెలిపారు. మార్కెట్‌ను మరింతగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు.

దళిత మహిళపై దాడి గర్హనీయం

చోడవరం: తమ నాయకురాలిపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని మాల మహానాడు ముఖ్య నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా మాల మహానాడు ముఖ్య నాయకుల సమావేశం చోడవరంలో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. ప్రధానంగా చోడవరంలో దళిత నాయకురాలి ఇంటిపై దాడికి పాల్పడి, కులం పేరుతో దూషించిన వారిని ఇంత వరకూ అరెస్టు చేయకపోవడం అన్యాయమని వాపోయారు. ఈ నెల 9వ తేదీలోగా అరెస్టు చేయకపోతే అనకాపల్లి డీఎస్పీ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగుతామని హెచ్చరించారు. మాల మహానాడు జిల్లా నాయకులు సియాద్రి శ్రీనువాసరావు, వేచలపు ప్రకాష్, నడుపూరి దేముడు మాస్టారు, పతివాడ నాగభూషణం, బోని గనేష్, గంటా అప్పారావు, గాడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రాజునాయుడు కుటుంబానికి పరామర్శ



రాజునాయుడు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

రావికమతం: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గట్రెడ్డి రాజునాయుడు అంత్యక్రియలు శుక్రవారం నిర్వహించారు. వృద్ధాప్య సంబంధ వ్యాధులతో ఆయన గురువారం మృతి చెందిన సంగతి తెలిసిందే. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ విజయవాడలో ఉండటంతో రాలేకపోయారు. మృతుడి కుమారుడిని ఫోన్లో పరామర్శించారు. అతడికి ధైర్యాన్నిచ్చారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, పూర్వ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ముక్కా మహలక్ష్మినాయుడు, పీఆర్టీయూ విశాఖ, అనకాపల్లి జిల్లాల అధ్యక్షులు మడ్డు శ్రీనివాస్, డి.గోపీనాథ్, బుచ్చెయ్యపేట, రావికమతం జెడ్పీటీసీలు దొండా రాంబాబు, తలారి రమణమ్మ ఆదిమూర్తి, రావికమతం, రోలుగుంట ఎంపీపీలు పైల రాజు, యర్రంశెట్టి శ్రీనివాసరావు, మాడుగుల వైస్ ఎంపీపీ రాజారాం, డీసీఎంఎస్ డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవ, మండల సచివాలయ కన్వీనర్ కంచిపాటి జగన్నాథరావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గల్లా రాజేశ్వరరావు తదితరులు రాజునాయుడు కుటుంబాన్ని పరామర్శించి సంతాపం తెలిపారు.

అనారోగ్యంతో చోడవరం ఏఎస్ఐ మృతి



అంత్యక్రియల్లో పోలీస్ గౌరవ వందనం, (ఇన్‌సెట్) రమణ(ఫైల్)

చోడవరం రూరల్: కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న చోడవరం ఏఎస్సై జి.బి.వి.రమణ శుక్రవారం ఉదయం మృతి చెందారు. ఆయన స్వగ్రామం అనకాపల్లి మండలం సాలాపువానిపాలెంలో పోలీసు గౌరవ వందనంతో భౌతిక దేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. చోడవరం సీఐ బి.శ్రీనివాసరావు, సిబ్బంది హాజరై తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో రమణ సేవలను గుర్తు చేసుకున్నారు.